సాక్షి సిద్దిపేట

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



పౌర సేవలపై 'సమ్మె'ట

స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్య పాత్ర పోషించే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టారు. వివరాలు 8లో ▸



గణేష్ నిమజ్జనంలో విషాదం

గణేష్ నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా చెప్యాలకు చెందిన యువకుడు నీట మునిగి మృతిచెందాడు. వివరాలు 8లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు చివరి గడువు ఈ నెల 10 వరకు ఉంటుందన్నారు. వివరాలకు ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

సీసీ కెమెరాల పరిశీలన



గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న జీఆర్‌ఎంబీ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై ఇటీవల గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ) సీసీ కెమెరాలను బిగించిన విషయం తెలిసిందే. శనివారం వాటిని జీఆర్‌ఎంబీ అధికారులు పరిశీలించారు. వాటి పనితీరు పై ఆరా తీశారు. అదేవిధంగా కట్టపై ఏర్పాటు చేసిన కొన్ని కెమెరాల పోల్స్ ఎత్తు పెంచాలని సూచించారు. ప్రస్తుతం కట్టపై ఎలాంటి పనులు కొనసాగడం లేదు.

ఆలయ హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయ హుండీని శనివారం లెక్కించారు. శ్రీ శరబేశ్వర స్వామి ఆలయ ఈఓ రవి కుమార్, శ్రీ సంతోషిమాత ఆలయ ఈఓ విశ్వనాథశర్మల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 5నుంచి సెప్టెంబర్ 30వరకు భక్తులు అమ్మవారికి సమర్పించిన కట్న కానుకలను లెక్కించారు. హుండీ ఆదాయం రూ.2,20,347 వచ్చిందని అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు గ్యాదగోని సత్యనారాయణ గౌడ్, చకిలం అమర్‌నాథ్, కాముని ప్రభాకర్, కొమురవెల్లి కల్యాణి, గరిపెల్లి సువర్ణ, ఎక్స్ అఫీషియో సభ్యులు శాకం మధుసూదన్‌శర్మ, పూజారి రామకృష్ణ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు వచ్చేశాయ్



సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ సందర్భంగా ఆడపడుచులకు అందించే చీరలు జిల్లాకు చేరుకున్నాయి. ఈ ఏడాది జిల్లాలో 3,82,832 మందికి చీరలు అవసరమని జిల్లా చేనేత శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లాకు 2,74,600 చీరలు వచ్చాయి. మిగిలినవి మరో మూడు రోజుల్లో రానునట్లు చేనేత శాఖ అధికారి సంతోష్ కుమార్ తెలిపారు. అక్టోబర్ 4నుంచి ప్రభుత్వం చీరలను పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. హుస్నాబాద్ మార్కెట్ కమిటీ గోదాంలో చీరలను నిల్వ చేశామని, వాటిని డీఆర్డీఏ శాఖ ద్వారా మండల కేంద్రాలకు పంపిస్తామని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న రాజనర్సు

సిద్దిపేటఎడ్యుకేషన్: సీఎం కేసీఆర్ అధిక సంఖ్యలో గురుకులాలను స్థాపించి విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ 19 జూనియర్ కళాశాలల జిల్లాస్థాయి క్రీడా పోటీల ముగింపు సమావేశాన్ని శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్‌తో కలిసి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఆనందంతో పాటు సామర్థ్యం పెంపొందుతుందన్నారు. అండర్ 19 క్రీడల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య మాట్లాడుతూ త్వరలో జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కనకచంద్రం, సత్యనారాయణరెడ్డి, ఎల్లం యాదవ్, సురేష్, భరత్‌రెడ్డి, గుండి ప్రవీణ్, కనకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా..

- భరోసా, సఖి సెంటర్లు దేశానికే ఆదర్శం
- మహిళల రక్షణకు సీఎం కేసీఆర్ కృషి
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



డీజీపీ అంజనీకుమార్, అడిషనల్ డీజీపీ శిఖ గోయల్‌తో కలిసి సఖి సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటకమాన్: మహిళలు, బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా, సఖి సెంటర్లు దేశానికే ఆదర్శమని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో రూ.కోటి 18లక్షలతో నూతనంగా నిర్మించిన భరోసా, సఖి సెంటర్లను డీజీపీ అంజనీకుమార్, రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీపీ శిఖగోయల్‌తో కలిసి శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేటలో నూతనంగా నిర్మించిన మహిళా సంరక్షణ భవన సముదాయంలో భరోసా సెంటర్, సఖి సెంటర్, బాలల రక్షణ భవనం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను ఒకేచోట ఏర్పాటు చేసుకొని వాటిని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వీటి పక్కనే పోలీసు స్టేషన్ ఉండడం వల్ల భద్రత ఉంటుందన్నారు. ఈ సెంటర్లకు వచ్చే బాధిత మహిళలకు వ్యక్తిగత గోప్యతతో పాటు కౌన్సెలింగ్, లీగల్ సపోర్ట్‌తో కూడిన రక్షణ లభిస్తుందన్నారు. ఈ సెంటర్ల టోల్ ఫ్రీ నంబర్ అందరికీ తెలిసేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. సీఎస్ఆర్ ద్వారా భవన సముదాయాన్ని నిర్మించిన గ్రావో పెట్రో కెమికల్ ఎండీ శ్రీనివాస్ అభినందనీయులని మంత్రి తెలిపారు. పక్కనే ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండడం వల్ల బాధితులకు మెరుగైన వైద్యం అందుతున్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఆకర్షణ భరోసా సెంటర్‌కు 752 పుస్తకాలు అందించి లైబ్రరీని ఏర్పాటు చేసినందుకు మంత్రి అభినందించారు. ఇప్పటి వరకు ఆ విద్యార్థిని రాష్ట్రంలో 7 భరోసా సెంటర్‌లకు పుస్తకాలు అందించడం గొప్ప విషయమన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనలను డీజీపీ పక్కాగా అమలు చేస్తున్నారని అన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రంను సీఎం కేసీఆర్ దిక్సూచిగా నిలుపుతున్నారన్నారు. అంతకుముందు డీజీపీ అంజనీకుమార్, అడిషనల్ డీజీపీ శిఖగోయల్ మాట్లాడుతూ.. సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో భరోసా సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణకు పెద్దపీట వేస్తుందన్నారు. సిద్దిపేట పట్టణం ఒక మోడల్ ఏరియాగా తయారైందన్నారు. రాష్ట్రంలో 331 షీటీమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. దేశంలో తెలంగాణలో మాత్రమే ప్రతీ పోలీస్ స్టేషన్‌లో మహిళా విభాగం ఉందన్నారు. ఈ సందర్భంగా డీజీపీని ప్రత్యేక మెమోంటోతో మంత్రి సత్కరించారు. అడిషనల్ డీజీపీకి గొల్లబామ చీరను బహూకరించి అభినందించారు. అంతకుముందు డీజీపీకి సీపీ శ్వేత పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ రమేష్ నాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ కడవెర్గు మంజుల, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మచ్చ విజిత, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అడిషనల్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఏసీపీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, సీఐ దుర్గ, ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



ఫ్యాక్టరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్ సాగు రైతుల పాలిట అభయహస్తమని మంత్రి హరీశ్‌రావు కితాబు ఇచ్చారు. మాకు ఎలక్షన్లు వస్తయ్.. మీకు విజ్ఞప్తి చేస్తున్నా.. శాస్త్రవేత్తలతో మండలాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, హార్టికల్చర్ కమిషనర్, వ్యవసాయ అధికారులకు కోరుతున్నామని మంత్రి పేర్కొన్నారు. రూ.300 కోట్లతో నంగునూరు మండలం నర్మేటలో నిర్వహిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శనివారం హరీశ్‌రావు భూమి పూజ చేశారు. అనంతరం ఫ్యాక్టరీ నమూనాను పరిశీలించి సంవత్సరంలోపు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతో నర్మేటలో ఫ్యాక్టరీ నిర్మించడంతో ఇక్కడి రైతులకు మేలు జరుగుతుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆయిల్ కొనుగోళ్ల రూపంలో మారక ద్రవ్యం విదేశాలకు తరలివెళ్తుందన్నారు. నాడు జై జవాన్.. జై కిసాన్ అని నినదించిన వారి పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగితే.. కేసీఆర్ పాలనలో ఆత్మగౌరవం పెరిగిందన్నారు. 20 లక్షల ఎకరా ల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ పంటసాగుతో చీడ, పీడలు, అడవి పందులు, కోతుల బెడద తప్పుతుందన్నారు.

వ్యర్థం లేదు.. అంతా ఉపయోగమే

నర్మేటలో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తున్న ఆయిల్ కర్మాగారంలో రిఫైనరీ ఆయిల్ తయారు చేయడంతో పాటు ప్యాకెట్లు ఇక్కడే తయారు చేస్తారన్నారు. పొట్టుతో దాన, పిప్పితో ఫ్యాక్టరీకి అవసరమయ్యే కరెంటు ఇక్కడే ఉత్పత్తి చేస్తారన్నారు. అలాగే ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే వృథా నీటిని కలుషితం కాకుండా శుద్ధి చేసి పరిశ్రమ అవసరాలకు వినియోగించేందుకు కోట్ల లీటర్ల సామర్థ్యంతో అండర్ గ్రౌండ్ ట్యాంక్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎండీ సురేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, హార్టికల్చర్ కమిషనర్ హన్మంతారావు, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ అజీద్, ఎంపీటీసీ బాబు, జెడ్పీటీసీ ఉమ పాల్గొన్నారు.

ఓర్పునకు భూమియే పెద్దసాక్షి



ప్రవచనాలకు హాజరైన ప్రజలు

చాగంటి కోటేశ్వరరావు



సిద్దిపేటజోన్: మనిషి ఓర్పునకు భూమి ఒక పెద్ద సాక్షి అని, కష్టాలను తట్టుకొని నిలబడిన వారు జీవితంలో అన్ని సాధిస్తారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో మానవీయ విలువలపై ప్రవచనాలు చేశారు. మనిషి దయాగుణం కలిగి ఉండాలని, అప్పుడే భగవంతుని కృపకు పాత్రులు అవుతారన్నారు. ఎదుటివారి తప్పులు లెక్కించడం మాని, అందరి కోసం బతకడం నేర్చుకోవాలని అన్నారు. కష్టంలో ఉన్నవారిని ఆదుకోవాలని, సహనం, ఓర్పు అనేవి గొప్ప లక్షణాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సీపీ శ్వేత, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల పాల్గొన్నారు.

ప్రవచనాలు గొప్ప సందేశాలు : హరీశ్‌రావు

మానవీయ విలువలకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ప్రేరణ అని మంత్రి హరీశ్ అన్నారు. శనివారం రంగనాయక సాగర్ నీటిపారుదల అతిథి గృహంలో చాగంటితో మంత్రి కాసేపు ముచ్చటించారు. సిద్దిపేట ప్రజలకు ప్రవచనం చేయడం పట్ల మంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రగతి, మీ పనితీరు గురించి చాలాసార్లు విన్నానని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూశానని పేర్కొన్నారు.

సామాన్యులే లక్ష్యంగా సైబర్ నేరాలు

- అనవసర మెసేజ్‌లకు స్పందించవద్దు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోషీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు జడ్జి పి. సామ్ కోసీ

సిద్దిపేటకమాన్: యువకులు, సామాన్యులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు, డ్రగ్ మాఫియా రెచ్చిపోతున్నారని, అవగాహన లేకపోవడంతోనే అమాయకులు మోసపోతున్నారని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషీ అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట విపంచి కళానిలయంలో శనివారం డ్రగ్ అబ్యూస్, సైబర్ నేరాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సామ్ కోషీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు పంపించే అనవసర మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఇంటర్‌నెట్‌ను తక్కువగా వినియోగించాలని సూచించారు. హైదరాబాద్, బెంగుళూర్, ముంబయి లాంటి నగరాల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా యువత గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని అన్నారు. యువత చెడుదారుల వైపు వెళ్లకుండా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. చదువు మధ్యలో మానేసిన యువత మత్తు పదార్థాలకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, అలాంటి వారికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు అవగాహన కల్పించాలన్నారు. అథారిటీ మెంబర్ సెక్రటరీ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాలు కూడా మారుతున్నాయన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకును ఓపెన్ చేయకూడదని, వ్యక్తిగత, బ్యాంకు వివరాలు, డెబిట్, క్రెడిట్ కార్డు, ఓటీపీ వంటి వివరాలు ఎవరికీ చెప్పవద్దని తెలిపారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌ల పేరిట వేధింపులు, ఒత్తిడిలు పెరగడంతో ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు అడ్వకేట్లు, పోలీసు అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం, న్యాయమూర్తి స్వాతిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, కొండపాక తిమ్మారెడ్డిపల్లి వినాయక లా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవింద్రప్రసాద్, కళాశాలకు చెందిన లా స్టూడెంట్స్ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు స్పెషల్ డ్రైవ్

దోమల నివారణకు చర్యలు

- కుక్కలు, పందుల బెడద నివారిస్తాం
- ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీస్‌లు
- సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్

హుస్నాబాద్ పట్టణంలోని 20 వార్డుల్లో పారిశుధ్య నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. వాడవాడలా ప్రతీ రోజు వార్డు ఆఫీసర్లతో విజిట్ చేయిస్తాం. ప్రజలు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలి. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. ఇప్పటికే ఫాగింగ్ మిషన్‌తో స్ప్రే చేయిస్తూ, మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం. మరో ఫాగింగ్ మిషన్ కొనుగోలు కోసం కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశాం.

– రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్, హుస్నాబాద్.



సాక్షి ఫోన్ ఇన్



హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్: మున్సిపల్ కార్యాలయంలో శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలను ప్రజలు ఫోన్ ద్వారా కమిషనర్ దృష్టికి తెచ్చారు. వాటి సత్వర పరిష్కారం కోసం అన్ని వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని వివిధ విభాగాల అధికారులను ఆదేశించారు.

➡ ఇళ్ల ఎదుట వేసిన రోడ్లు ఎత్తుగా ఉన్నాయి. దీంతో వీధుల్లో మురుగు నీరు నిలుస్తుంది. దీనిపై చర్యలు తీసుకోండి.
(రెడ్డి కాలనీ, అయిలేని హన్మంతరెడ్డి)

కమిషనర్: నీటి గుంతలు ఉన్నచోట మొరం పోయిస్తాం.

➡ రెడ్డి కాలనీలోని టవర్ వద్ద మురికి కాలువలు నిర్మించలేదు. దీంతో మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తుంది.
(రిలయన్స్ టవర్ రోడ్, సత్యనారాయణ రెడ్డి)

కమిషనర్: ఆ ఏరియాను పరిశీలించి రోడ్డుపై మురుగు నిల్వకుండా చర్యలు చేపడుతాం.

➡ ప్రతీ ఇంటిలో ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.
(ఆరపల్లె, వెల్పుల నాగార్జున్, తిరుమలేష్, నమిలికొండ మనోజ్)

కమిషనర్: దోమల నివారణకు ఫాగింగ్ మిషన్‌తో స్ప్రే చేయిస్తున్నాం. మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం.

➡ ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి, పిచ్చి మొక్కలు పెరిగి దోమలు విజృంభిస్తున్నాయి. చర్యలు తీసుకోండి.
(టీచర్స్ కాలనీ, అయిలేని మల్లికార్జున్ రెడ్డి)

కమిషనర్: ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని ఇప్పటికే యజమానులకు నోటీస్‌లు అందించాం. కొంతమంది అడ్రస్ దొరకడం లేదు.

➡ మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. దోమలతో విష జ్వరాలు వస్తున్నాయి.
(ఆరపల్లె, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో పోతరబోయిన రవి)

కమిషనర్: వారంలో రెండు దఫాలు మురుగు కాలువల్లో ఫాగింగ్ చేయించి దోమలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

➡ కాలువలు లేక రోడ్లపైనే మురుగు నిలుస్తుంది. సమీప పాఠశాల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు.
(ఎల్లంబజార్, బుర్ర రాజేందర్)

కమిషనర్: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాగానే ఆ ఏరియాను పరిశీలించి మురుగు కాలువల నిర్మాణం చేపడతాం.

➡ తమ వార్డుల్లో పారిశుధ్య పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా స్పందించడం లేదు.
(ఆరపల్లె, పెద్ది శ్రీధర్)

కమిషనర్: వెంటనే పారిశుధ్య కార్మికులను పంపించి మురుగు కాలువలు, చెత్తను తొలగింప చేస్తాం.

➡ మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు. రాత్రి వేళల్లో దోమలతో ఇబ్బంది పడుతున్నాం.
(9వ వార్డు, జక్కుల మహేందర్)

కమిషనర్: ఫాగింగ్ మిషన్ ద్వారా స్ప్రే చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం.

➡ వాటర్ ట్యాంక్ వద్ద పాకురు పట్టి ఉంది. అక్కడి నుంచి వెళ్లేవారు జారి కింద పడుతున్నారు. క్లీన్ చేయించండి.
(8వ వార్డు, పెద్ది శ్రీనివాస్)

కమిషనర్: వాటర్ ట్యాంక్ వద్ద వెంటనే క్లీన్ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

➡ వీధి కుక్కల దాడులతో పలువురు గాయపడ్డారు. చర్యలు తీసుకోండి.
(స్నేహనగర్, అక్కు శ్రీనివాస్)

కమిషనర్: కుక్కలను పట్టేవారు దొరకడం ఆలస్యమైంది. రెండు, మూడు రోజుల్లో కుక్కలను పట్టిస్తాం.

➡ ఇళ్లలోకి పందులు వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నాం. వాటిని ఊరు బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలి
(అంబేడ్కర్ నగర్, బత్తుల శంకర్ బాబు)

కమిషనర్: పందుల పెంపకం దారులకు అవగాహన కల్పిస్తాం. ఊరు బయట పెంచుకునేలా నోటీస్‌లు జారీ చేస్తాం.

➡ మురుగు కాలువ నుంచి తీసిన చెత్తను 15 రోజులపాటు రోడ్లపైనే ఉంచుతున్నారు. దీంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.
(ఆరపల్లె, గొర్ల శ్రీధర్, ఆంజనేయులు)

కమిషనర్: పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తొలగిస్తాం. మళ్లీ ఇలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

➡ మిషన్ భగీరథ వాటర్ లీకేజీతో పాటు వాసన వస్తున్నాయి. లీకేజీలను నివారించి సురక్షిత నీటిని అందించాలి.
(15వ వార్డు, ఎగ్గోజు సుదర్శనచారి)

కమిషనర్: దినం తప్పించి దినం సురక్షితమైన నీటినే సరఫరా చేయిస్తున్నాం. ఏరియా వైజ్‌గా ఏఈతో తనిఖీలు చేయించి లీకేజీలు లేకుండా మరమ్మతులు చేయిస్తాం.

శ్రీవిద్యాధరి సన్నిధిలో గన్నవరం పీఠాధిపతి



వర్గల్ అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న శ్రీ సత్యానంద స్వామి

వర్గల్(గజ్వేల్): వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రాన్ని శనివారం గన్నవరం పీఠాధిపతి శ్రీ సత్యానంద భారతి స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. కొండపైన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం తరపున స్వామివారికి సముచిత సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్వామివారు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఆధ్యాత్మిక ప్రపంచ నిర్మాణంలో వర్గల్ క్షేత్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రాచీన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో చంద్రశేఖరశర్మ సిద్ధాంతి ప్రధానకర్తగా అవిరళ కృషి, అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సరస్వతీ క్షేత్రం అనతి కాలంలోనే ప్రముఖ పుణ్య క్షేత్రంగా, భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతుందన్నారు. ఆలయాల సముదాయమైన శంభుగిరి ఆధ్యాత్మిక సంపదతో మంత్రముగ్ధుల్ని చేస్తుందని స్వామివారి పేర్కొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని మృతదేహం

నారాయణఖేడ్: పట్టణ శివారులోని రాయిపల్లి రోడ్‌లో ఓ మద్యం దుకాణం ఎదుట రోడ్డు పక్కన పొదల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం సాయంత్రం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వయస్సు సుమారు 30 ఏళ్ల ఉంటుందని స్థానికులు తెలిపారు.

రాయచెరువులో...

నర్సాపూర్‌రూరల్: స్థానిక రాయరావు చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు సీఐ షేక్‌లాల్ మదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతదేహంపై తెల్లని బనియన్, పర్పుల్ రంగు షర్ట్, నలుపురంగు ప్యాంట్, నల్లని బెల్టు ఉన్నాయని, 32 ఏళ్ల ఉండవచ్చని తెలిపారు. సమాచారం కోసం పోలీస్‌స్టేషన్ (8712657940, 8712657941)లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి అర్చకులకు శిక్షణ

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లాలోని ధూప దీప నైవేద్యం అర్చకుల శిక్షణ శిబిరానికి వర్గల్ మండలం నాచారం గుట్ట సిద్ధమైంది. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు అర్చకులకు పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 876 మంది అర్చకులకు ఈ శిబిరం ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు దేవదాయశాఖ ఏసీ శివరాజ్, నాచారం గుట్ట ఆలయ సహాయ కమిషనర్ అన్నపూర్ణ తెలిపారు. సత్యనారాయణ వ్రత మండపంలో శిక్షణ తరగతులు జరుగుతాయని, టీటీడీ కల్యాణ మండపంలో అభ్యర్థులకు భోజన, అల్పాహారం ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు.

20 రోజులుగా ఆందోళనలు

పౌర సేవలపై 'సమ్మె'ట

- 5 ప్రాజెక్టుల్లో 1,504 కేంద్రాలు మూత
- ఫలించని ప్రత్యామ్నాయ చర్యలు
- కేంద్రాల్లో నిలిచిన సేవలు
- స్పందనలేని ప్రభుత్వం: అంగన్‌వాడీలు



నారాయణఖేడ్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

నారాయణఖేడ్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల కృషి అంతా ఇంతా కాదు. వారు చేసేసేవలు ఎనలేనివి. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, బోధించడంలో అంగన్‌వాడీల అనుబంధం చెప్పలేనిది. స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాల్లో ముఖ్య పాత్ర పోషించే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టారు. 20 రోజులుగా నిరవధిక సమ్మెకు దిగడంతో అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు రోజువారీగా అందించే పౌష్టికాహారం, బోధన తదితర సేవలకు ఆటంకం ఏర్పడింది. సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు ఆదేశించినా పూర్తిస్థాయిలో అది సాధ్యంకాక ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట, పటాన్‌చెరు, సదాశివపేటల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఉన్నాయి. ఈ ప్రజెక్టుల పరిధిలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 99,634, గర్భిణులు 11,698, బాలింతలు 6,851 ఉన్నారు. ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేసోంది. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు నెలకు రెండుసార్లు పౌష్టికాహారం పంపిణీ, 3–5 ఏళ్ల చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఒకపూట పౌష్టికాహారంతో కూడిన భోజనం వండి పెడుతున్నారు. రోజూ కోడిగుడ్డు, పాలు, ఒకపూట సంపూర్ణ భోజనం ఆయా కేంద్రాల్లో అందజేస్తారు. అలాగే చిన్నారులకు బోధన కొనసాగుతోంది. కానీ వారంతా సమ్మెబాట పట్టడంతో పౌష్టికాహార సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో గ్రామాలు, బస్తీల్లోని పేదలు, చిన్నారులు నష్టపోతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు..

అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడడంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఆర్పీలు, గ్రామాల్లో వీవోఏలు, కార్యదర్శులకు కేంద్రాల బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వెంటనే పౌష్టికాహారం అందేలా చూడాలని ఆదేశించారు. కాని క్షేత్రాస్థాయిలో మాత్రం అమలు కావడంలేదు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీలు అక్కడక్కడా కొన్ని కేంద్రాల తాళాలు తీసినా కేంద్రాల నిర్వహణ మాత్రం సాగడంలేదు.

ఇదీ ప్రభుత్వ వాదన..

ప్రభుత్వం మాత్రం పదవీ విరమణ వయసు 65 ఏళ్లు, విరమణ సమయంలో టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు, ఆసరా పింఛన్ ఇస్తామని పేర్కొంటుంది. ఉద్యోగాల క్రమబద్ధీకరణ అంశం కేంద్ర ప్రభుత్వంతో ముడిపడి ఉందని, వేతన సవరణ మాత్రం ఇతర ఉద్యోగులకు పెంచిన సందర్భాల్లో అంగన్‌వాడీలకూ పెంచుతున్నాం అని పేర్కొంటుంది.

"సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన ఆగదు



ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుంది. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలి. ఈఎఫ్, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలి. తమ పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ల ఉంచాలి. టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు చెల్లించాలి.

– వీణాకుమారీ, అంగన్‌వాడీ టీచర్, శెల్గిర

స్పందన లేదు..



20 రోజులకు పైగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కన్పించడం లేదు. 2018లో టీచర్లు, ఆయాలకు కేంద్రం పెంచిన వేతనం అమలు చేయాలి.

– నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్, నారాయణఖేడ్"

ఇవీ డిమాండ్లు..

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయడంతో పాటు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలతోపాటు వేసవిలో పాఠశాలలతో సమానంగా సెలవులు ఇవ్వాలి. ఆరోగ్య లక్ష్మి మెనూ చార్జీలు పిల్లలకు రూ.5, గర్భిణులు, బాలింతలకు రూ.10కి పెంచాలి. పదవీ విమరణ వయస్సును 60 ఏళ్ళకు చేయాలి. పదవీ విరమణ సమయంలో టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షలు చెల్లించాలి. గత నిబంధనల ప్రకారం ఎస్ఎస్‌సీ అర్హత ఉన్న హెల్పర్లకు పదోన్నతుల సౌకర్యం కల్పించాలి. సీనియార్టీని బట్టి వేతనంలో వ్యత్యాసం కల్పిస్తూ ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలి. బీఎల్‌వో డ్యూటీలు రద్దు చేయాలి, ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులను చేయించకూడదు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా గుర్తిస్తూ ప్రకటించిన సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయాలి. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలి. పక్కాభవనాలు, మౌలిక వసతులను కల్పించాలి. 2018 అక్టోబర్‌లో కేంద్రం పెంచిన వేతనం అంగన్‌వాడీ టీచర్లకు రూ.1,500, ఆయాలకు రూ.750లు, మినీ వర్కర్లకు రూ.1.250లు రాష్ట్ర ప్రభుత్వం ఏరియర్స్‌తో సహా చెల్లించాలి. ఇలా మొత్తం 28 డిమాండ్లను పరిష్కరించాలంటూ సమ్మెలో కొనసాగుతున్నారు.

జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు



పవన్‌కుమార్



ఎండీ అమన్

గజ్వేల్‌రూరల్: మంజీరా కాన్సెప్ట్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పవన్, మహతి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎండీ.అమన్ జాతీయ స్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మంజీరా పాఠశాల కరస్పాండెంట్ అంబదాస్ ప్రిన్సిపాల్ రజితతో కలిసి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.పవన్ కుమార్ ఆగస్టు 26, 27 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే మహతి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎండీ.అమన్ జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ గోపీనాథ్‌శర్మ, ప్రిన్సిపల్ షబానా తెలిపారు. విద్యార్థులు అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు మహారాష్ట్రలోని షిరిడీలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఆయా కార్యక్రమాల్లో పీఈటీ ఏసురాజు, ఉపాధ్యాయులు శశిధరశర్మ, పీఈటీ విజయ్‌కుమార్, శ్రీకుమార్, తిరుపతి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి



ఆశ్రిత్

సిద్దిపేటజోన్: జిల్లా బాస్కెట్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థి ఆశ్రిత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సంగారెడ్డిలో శనివారం జరిగిన ఎంపిక పోటీల్లో ఆశ్రిత్‌కు చోటు దక్కింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి వంశీ ర్షం వ్యక్తం చేశారు.

3న సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు రైలు

- కాశేశ్వరంతో రైతుల్లో సంతోషం
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రజల ఆరు దశాబ్దాల కల కొద్ది గంటల్లో నెరవేరబోతుందని, 3న మధ్యాహ్నం మూడు గంటలకు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు రైలు పోతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఆత్మీయ సమ్మేళనం, క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ సందర్భంగా మాట్లాడారు. భవిష్యత్తులో సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగుళూరుకు రైల్వే సౌకర్యం రానుందని స్పష్టం చేశారు. పదవులు శాశ్వతం కాదని, చేసిన మంచి పనులు, సేవలు చిరస్థాయిగా ఉంటాయన్నారు. జిల్లాలోని ప్రయివేటు పాఠశాలలో పని చేసే టీచర్లకు తన సొంత ఖర్చులతో ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పిస్తానని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

గురుకుల పాఠశాల ప్రారంభం..

సిద్దిపేటరూరల్: కాళేశ్వరం ద్వారా రైతులు సంవత్సరానికి రెండు పంటలు పండించుకుంటూ ఎంతో సంతోషంగా ఉంటున్నారని రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. మండల పరిధిలోని రావురూకుల, చింతమడక గ్రామాలో శనివారం ఆయన పలు ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వెంకటేశ్వర ఆలయ నిర్మాణం పనులు, పురిగిరి క్షత్రియ(పెరిక) సంఘ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. నేడు గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అరఎకరం స్థలంలో పెఱిక భవనాన్ని నిర్మించుకోవడం సంతోషకరమన్నారు. తరువాత చింతమడక గ్రామంలో రూ.10 కోట్లతో నిర్మించిన బీసీ బాలికల గురుకుల పాఠశాల భవనం, నెమలి వనం అర్బన్ పార్క్‌ను ప్రారంభించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ రోజా రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, కౌన్సిలర్లు మల్లికార్జున్, ట్రెస్మా అధ్యక్షుడు మల్లారెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, సుడా చైర్మెన్ రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూంల లొల్లి..

- లబ్ధిదారులకు హైకోర్టు నోటీసులు
- కోర్టును ఆశ్రయించిన వారితో వాగ్వాదం

కొండపాక(గజ్వేల్): డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు హైకోర్టు నోటీసులు రావడంతో కలకలం రేగింది. డబుల్ బెడ్రూంలు పొందిన వారికి హైకోర్టు నుంచి నోటీసులు జారీఅయ్యాయి. బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఆ నోటీసులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. దీంతో నోటీసులు అందుకున్న లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించిన వారిపై దాడికి యత్నించారు. ఈ సంఘటన కొండపాక మండలంలోని ఖమ్మంపల్లిలో చోటు చేసుకుంది. ఖమ్మంపల్లి గ్రామంలో ప్రభుత్వం 60 డబుల్ బెడ్రూంలను నిర్మించింది. రాజకీయ నాయకులు పెత్తనం చెలాయించడంతో ఎంపికలు ఏళ్లకాలం వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు 60 డబుల్ బెడ్రూంలకు గాను 41 మందిని ఎంపిక చేసి పట్టా సర్టిఫికెట్లను అధికారులు అందజేశారు. 19 డబుల్ బెడ్రూంల విషయంలో అవకతవకలు జరిగాయని కొందరు కలెక్టరు, ఆర్డీవో, తహసీల్దార్‌ల దృష్టికి తీసుకెళ్ళారు. అధికారుల్లో చలనం లేకపోవడంతో యాటెల్లి యాదగిరి హైకోర్టులో పిటీషన్ వేశారు. దీంతో హైకోర్టు కలెక్టరు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు డబుల్ బెడ్రూం పట్టా సర్టిఫికెట్లు పొందిన వారికి శనివారం నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఒకరిపై ఒకరు త్రీ టౌన్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎంక్వైరీచేసి నిందితులపై కేసు నమోదు చేస్తామని త్రీటౌన్ సీఐ భాను ప్రకాశ్ తెలిపారు.

క్రైం రేట్ తగ్గించేలా పనిచేయాలి

డీజీపీ అంజనీకుమార్

సిద్దిపేటకమాన్: పారదర్శకంగా విధులు నిర్వహించాలని, నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. అడిషనల్ డీజీపీ శిఖగోయల్, డీఐజీ రమేష్‌నాయుడు, సీపీ శ్వేతతో కలిసి ఆయన శనివారం పోలీసు కమిషనర్ కార్యాలయం, పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ..కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఆరు, ఏడు నెలల్లో 600 మంది పోలీసు అధికారులకు సీఐ నుంచి డీఎస్పీ, డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి వరకు పదోన్నతులు ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పోలీసు స్టేషన్‌లలో సబ్ డివిజన్ నిధులు కేటాయించి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 750 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయని, ఏ స్టేషన్‌లోనైనా పోలీస్ వారు ఏ చిన్న తప్పు చేసినా మొత్తం డిపార్ట్‌మెంట్‌కు చెడ్డపేరు వస్తుందన్నారు. క్రైం రేట్ తగ్గించే విధంగా పనిచేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ పోలీసుశాఖకు అధునాతన వాహనాలను అందించినట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆవరణ ఆహ్లాదకరంగా ఉందని అభినందించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పోలీసు కన్వెన్షన్ సెంటర్‌ను అద్భుతంగా నిర్మించడం జరిగిందన్నారు. డీజీపీకి సీపీ శ్వేత జిల్లా భౌగోళిక పరిస్థితులు, నియోజకవర్గాల పరిధి, బార్డర్ పీఎస్‌లు, జిల్లాలో నూతనంగా నిర్మించిన ప్రాజెక్టులు తదితర అంశాల గురించి వివరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, రాంచద్రరావు, సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు రమేష్, సతీష్, చంద్రశేఖర్, సీఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ అంజనీకుమార్

గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనపై విచారణ

దుబ్బాకటౌన్: గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు ధ్వంసమయిన ఘటన దుబ్బాకలో జరిగింది. సంఘటన స్థలాన్ని శనివారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారిణి తనూజ సంబంధిత హెచ్‌పీసీఎల్ అధికారి శర్మ, అగ్ని మాపకశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధితుడు శ్రీనివాస్‌గౌడ్‌ను పరామర్శించారు. ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఇల్లు ధ్వంసం అయిందని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కుంబాల రవిందర్, కార్యదర్శి ఆస ముత్యం, రాజిరెడ్డి, పర్శరాములు, అజయ్ తదితరులు ఉన్నారు.

అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే.. కేసీఆర్ కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో భూంపల్లి–అక్బర్‌పేట మండలం ఎనగుర్తికి బీఆర్ఎస్ నాయకులు బోరెడ్డి శిరీష, నర్సింహారెడ్డి, ప్రశాంత్, శివ, ఉమేష్ చంద్ర, రాజు, శ్రీకాంత్, ప్రణయ్‌తో పాటు 50 మంది శనివారం బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, త్వరలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కార్యకర్తకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే

'పెంచిన వేతనాలను అమలు చేయాలి'

గజ్వేల్‌రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్‌లక్ష్మి డిమాండ్ చేశారు. ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) ఎదుట శనివారం ధర్నా చేపట్టిన అనంతరం 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను అమలు చేయాలని, గుర్తింపు కార్డులు, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలని, బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు వెంకటచారి, బాసయ్య, భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, అమృత, యాదమ్మ, రెహనా, వైష్ణవి, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.



'గడా'ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గణేష్ నిమజ్జనంలో అపశృతి..



శ్రీకాంత్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): రెండువేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. గణేష్ నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా మండల పరిధిలోని చెప్యాల యువకుడు నీట మునిగి చనిపోయాడు. దీంతో నిమజ్జన శోభాయాత్ర విషాదంగా మారింది. అప్పటి వరకు సంతోషంగా కేరింతలు కొడుతూ వెళ్లిన యువకుడు విగత జీవిగా మారడంతో గ్రామంలో విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. అతడి భార్య, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. చెప్యాల గ్రామానికి చెందిన శ్రీకాంత్ (28) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య వనజ, ఏడు నెలల కుమారుడు ఉన్నారు. గ్రామంలో గల్లీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక నవరాత్రోత్సవాల ముగింపును పురస్కరించుకునినిర్వహించారు. ఉత్సవాలల్లో భాగంగా శుక్రవారం రాత్రి గణేష్ నిమజ్జన శోభాయాత్రలో శ్రీకాంత్ పాల్గొన్నాడు. ఆ రాత్రి గ్రామ శివారులోని కుమ్మరి కుంటలో నిజ్జనం చేస్తున్న క్రమంలో శ్రీకాంత్ గల్లంతయ్యాడు. దీంతో యూత్ సభ్యులు ఎంత వెతికినా ఫలితం లేక పోవడంతో వెనుదిరిగారు. శనివారం తెలవారు జామున మిరుదొడ్డి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్ళ సహాయంలో శ్రీకాంత్ మృత దేహాన్ని వెలికి తీశారు. శ్రీకాంత్ భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. మృతి చెందిన శ్రీకాంత్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు శనివారం పరామర్శించి ఓదార్చారు. ఆర్థిక సాయం అందించారు.



కుటుంబాన్ని ఓదారుస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మరమ్మతులు చేస్తుండగా..



బేతయ్య మృతదేహం

టేక్మాల్(మెదక్): మరమ్మతుల కోసం కుంటలో దిగిన ఒక విద్యుత్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన టేక్మాల్ మండలంలోని దనూర శివారులో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ దయానంద్ కథనం ప్రకారం.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన భూషణంగారి బేతయ్య(52) కోరంపల్లిలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా ఈశ్వరుని కుంటలో పిడార్ లైన్ వైరు తెగి పడింది. శనివారం ఉదయం తోటి ఉద్యోగితో కలిసి చెరువులో పడిన వైరును తీయడానికి బేతయ్య ప్రయత్నించగా ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వెతికితీయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బేతయ్య భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రెండు బైకులు ఢీ కొని..



పెండ్యాల ప్రశాంత్ (ఫైల్‌ఫోటో)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన పెండ్యాల ప్రశాంత్(28) రేగొండ గ్రామానికి చెందిన నూనే శ్రీకాంత్ పందిల్ల గ్రామంలో ఎదురెదురుగా వచ్చి బైకులతో ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ప్రశాంత్ మృతి చెందాడు. శ్రీకాంత్ తీవ్రంగా గాయపడడంతో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గ్యాస్ డీలర్‌పై చర్యలు తీసుకోండి

దుబ్బాక: గ్యాస్ సిలిండర్ పేలి పట్టణానికి చెందిన బండి శ్రీనివాస్‌గౌడ్ ఇళ్లు పూర్తిగా ధ్వంసం కావడం బాధాకరమని వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కుంబాల రవీందర్ అన్నారు. శనివారం ఘటన స్థలిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘటనకు కారణమైనా హెచ్‌పీ గ్యాస్ కంపెనీ, డీలర్‌పైన ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం జిల్లా కార్యదర్శి ఆస ముత్యం, నాయకులు పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రవి, తదితరులు

కోమటిచెర్వు అద్భుతం



కొమటిచెర్వు సందర్శనలో రవికుమార్ తదితరులు

సిద్దిపేటజోన్: కోమటిచెర్వు అద్భుతంగా ఉందని, ఒక పర్యాటక కేంద్రంగా ఉందని రాష్ట్ర గీతా కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన కోమటిచెర్వు సందర్శించారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్ తరహాలో సిద్దిపేట కోమటిచెర్వు అందంగా మారిందన్నారు. ఆయన వెంట జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు బాలకిషన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

'పల్లా'ను కలిసిన నాయకులు



పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మల్లన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని బీఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఫొటో, ప్రసాదం అందజేశారు. పల్లాను కలిసిన వారిలో వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, కొమురవెల్లి ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, ఆలయ మాజీ డైరెక్టర్ ముత్యం నర్సింహులు, నాయకులు సార్ల కిష్టయ్య, గొల్లపల్లి కిష్టయ్య, ఏర్పుల మహేష్, తదితరులు ఉన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించండి'

చేర్యాల(సిద్దిపేట): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ శనివారం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట కార్మికులు సమ్మెకు దిగారు. ఈసందర్భంగా శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ దాసరి కళావతి మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి గతంలో ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని.. లేనిపక్షంలో సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ ఏర్పాటుతోనే పూర్వ వైభవం



న్యాయవాదులతో మాజీ ఎమ్మెల్సీ రాజలింగం

చేర్యాల(సిద్దిపేట): రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోనే చేర్యాలకు పూర్వ వైభవం వస్తుందని మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారం 20వ రోజుకు చేరుకోగా దీక్షలో చేర్యాల ప్రాంత న్యాయవాదులు కూర్చున్నారు. జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ ప్రారంభించిన దీక్షకు మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఇటీవలే మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చానని తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక: ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పట్టణానికి చెందిన బండి శ్రీనివాస్‌గౌడ్ ఇళ్లు ధ్వంసం కాగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. తక్షణమే వసతి ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. అండగా ఉంటానని.. అధైర్య పడొద్దని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబటి బాలేష్‌గౌడ్, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

దుబ్బాక: మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేటలో ప్రమాదవశాత్తు ప్రెషర్ కుక్కర్ పేలింది. వంట చేస్తున్న మహిళకు తృటిలో ప్రమాదం తప్పింది. 10వ వార్డుకు చెందిన బైరగోని భార్గవి శనివారం వంట గదిలో కుక్కర్‌లో పప్పు ఉడికించేందుకు గ్యాస్‌పై పెట్టి బయటకు వెళ్లింది. కొద్ది క్షణాల్లోనే వంట గది నుంచి భారీ శబ్దం వచ్చింది. లోనికి వెళ్లి చూడగా ప్రెషర్ కుక్కర్ పేలి స్లాబ్‌కు తగిలి కింద పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

లడ్డూను దక్కించుకున్న ముస్లిం



లడ్డూతో అత్తు ఇమామ్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని తొమ్మిదో వార్డులో బాల గణేష్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మడపం వద్ద శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ రెండోసారి లడ్డూను రూ. 5 వేలకు దక్కించుకున్నాడు.

పల్లె తోవ.. స్వచ్ఛతా హీ సేవ



రాముని పట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



బెజ్జంకి: చెట్టు ఆకృతిలో విద్యార్థుల మానవహారం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని విద్యానికేతన్ పాఠశాలలో శనివారం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు. చెట్టు ఆకారంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. అమృత కళశంతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చెత్తను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, కరస్పాండెంట్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కండి

చిన్నకోడూరు(సిద్దిపేట): స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామునిపట్లలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంతకుముందు గ్రామంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్/ హుస్నాబాద్‌రూరల్: నియోజకవర్గంలో గడపగడపకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విద్య, వైద్యం, సంక్షేమం, ఉపాధి కల్పనలో రూ. వేల కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశానన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశామని.. త్వరలోనే సీఎం కేసీఆర్ చేతుల ప్రాజెక్టును ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అలాగే పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ శమిత అన్నదానం చేశారు.



జన్మదినం సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అక్కన్నపేటలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎమ్మెల్యే సతీష్‌కుమార్ జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలు నాయక్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అశోక్‌బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

హుస్నాబాద్: మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో వేస్ట్ టు వండర్ కాంపిటేషన్ నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 46 మంది విద్యార్థులు వివిధ రకాల వస్తువులను తయారు చేసి తమలోని సృజనాత్మకతను వెలికితీశారు. చెత్తతో తయారు చేసిన వస్తువుల ఉపయోగాలను వివరిస్తూ వివిధ కళారూపాలతో స్టాల్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత స్టాల్‌ను పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమలో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రదర్శించాలని సూచించారు. అనంతరం నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్ గోవిందు రవి, కో ఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



స్టాల్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

ప్రజలందరూ కలిసిమెలిసి జీవించాలి

కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/దౌల్తాబాద్(దుబ్బాక)/ చేర్యాల(సిద్దిపేట)/ వర్గల్(గజ్వేల్): పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటలో ఆర్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. భూ సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు. దూల్మిట్ట మండలంలోని లింగాపూర్‌లో ఏఎస్ఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పౌర హక్కులకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుబ్బాక మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో ఆర్ఐ మధు, సర్పంచ్ పూజిత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో కుల వివక్ష లేకుండా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సాయిలు, ఉపసర్పంచ్ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండల పరిధిలోని నాగపురిలో తహసీల్దార్ రాజేశ్వర్‌రావు పౌరులకు హక్కులపై అవగాహన కల్పించారు. వర్గల్ మండలంలోని మీనాజీపేటలో గౌరారం ఏఎస్సై మధుసూదన్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ మాట్లాడుతూ అస్పృశ్యత పాటించొద్దని, అంటరానితనం నేరమని పేర్కొన్నారు.



గురువన్నపేట: పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హుస్నాబాద్ అదనపు జూనియర్ జడ్జి కృష్ణతేజ సూచించారు. శనివారం పోతారం(ఎస్)లోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకులంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు జడ్జి మహిళల చట్టాలు, గృహ హింస, బాలకార్మిక, న్యాయ వ్యవస్థ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దీకొండ ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

100వ రోజుకు చేరిన దీక్ష



దీక్షలో భూనిర్వాసితులు

వర్గల్(గజ్వేల్): ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం సేకరించిన భూమికి చట్టబద్ధమైన పరిహారం డిమాండ్‌తో మండలంలోని అవుసులోనిపల్లి వద్ద మాజీ ఎంపీటీసీ యాదయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్ష శనివారం 100వ రోజుకు చేరింది. ఈసందర్భంగా భూనిర్వాసితులు మాట్లాడుతూ.. వంద రోజులుగా దీక్ష కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

గజ్వేల్, గజ్వేల్‌రూరల్: ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధిలో పయనిస్తుందని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో «స్వచ్ఛతా హీ సేవా» కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించ తలపెట్టిన హెల్త్ సబ్‌సెంటర్ల కోసం మున్సిపల్ కమిషనర్‌తో కలిసి శనివారం స్థల పరిశీలన చేశారు.



పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

మా గోడు పట్టదా..?

అక్కన్నపేట(హుస్నాబాద్): నిషేధిత జాబితా నుంచి మా భూములు తొలగించి న్యాయం చేయాలని కపూర్‌నాయక్ తండా సర్పంచ్ భానోతు సంతోష్ నాయక్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజనులను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ సంతోష్‌నాయక్

హిందూ వాహిని జిల్లా కార్యవర్గం ఎన్నిక



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హిందూ వాహిని జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ సత్యం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా బండి కిరణ్ కుమార్, జిల్లా సమాచార సేకరణకర్తగా అర్జున్, జిల్లా ప్రచార ప్రముఖ్‌గా ప్రశాంత్, మహిళా ప్రముఖ్‌గా బండి దీప, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హిందూ వాహిని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివాజీ గణేష్, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ పొన్నాల శివ, జోనల్ ఇన్‌చార్జి సత్యం పాల్గొన్నారు.

బీసీలపై నిర్లక్ష్య వైఖరి సరికాదు

హుస్నాబాద్: బీసీలపై ఎమ్మెల్యే సతీష్‌కుమార్ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్‌లో వంద నామినేషన్లు దాఖలు చేస్తామని బీసీ సంఘాల నాయకులు హెచ్చరించారు. పట్టణంలో శనివారం బీసీల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీసీ భవనం, స్టడీ సర్కిల్ తదితర వాటి కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరినా పట్టించుకోలేదన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్, మల్లేశం, సుదర్శన స్వామి, అయిలయ్య, సంతోష్ పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



బాలకిషన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాక రూరల్: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ పొందిన వారికి పీఆర్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రాసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మా డిమాండ్లు నెరవేర్చండి



సిద్దిపేటలో భోజనం చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సిద్దిపేటరూరల్/దుబ్బాక/తొగుట/మిరుదొడ్డి (దుబ్బాక)/సిద్దిపేటఅర్బన్: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు శనివారం వి విధ కార్యక్రమాల ద్వారా నిరసన వ్యక్తం చేశారు. సిద్దిపేటలో సీఐటీయూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు లక్ష్మి, కళావతి, అరుణ, అంజమ్మ, రాజవ్వ, సరళ, తదితరులు పాల్గొన్నారు. తొగుటలో అంబేద్కర్ విగ్రహం ఎదుట అంగన్‌వాడీ, ఆశాలు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో ఆశావర్కర్లు చెవిలో పూలతో నిరసన వ్యక్తం చేశారు. దుబ్బాకలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్ష శిబిరం వద్ద ఆశావర్కర్లు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా నాయకురాలు నీరజ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

సిద్దిపేటఎడ్యుకేషన్: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని సిద్దిపేట ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల నేచర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ అయోధ్యరెడ్డి అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న చెట్లు పురోగతికి చిహ్నమని అన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ పుణ్యమ్మ, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న అయోధ్యరెడ్డి

'నిందితులను శిక్షించండి'

సిద్దిపేటఎడ్యుకేషన్: భవ్యశ్రీని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్, జిల్లా కార్యదర్శి డేవిడ్ డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో మణిపూర్ సంఘటన మరువక ముందే ఏపీలో ఈ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు.

శ్మశానవాటిక నిర్మాణ పనుల అడ్డగింత

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్ శ్మశానవాటిక నిర్మాణ పనులను ఎల్లారెడ్డిపేట గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన బాలవ్వ, సిరినేని తిరుపతి, భూపతిరెడ్డికి చెందిన వ్యవసాయ భూమిని మల్లన్నసాగర్ కాలువ నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించింది. కాగా కాలువ నిర్మాణానికి పోనూ 6.13 ఎకరాల భూమి మిగిలింది. ఈ భూమి తమకు కేటాయించాలని రైతులు ఈనెల 25న కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. కాగా తుక్కాపూర్ గ్రామానికి సంబంధించి శ్మశానవాటిక కోసం పనులు చేపట్టగా సర్పంచ్ సిరినేని గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. భూ వివాదంపై సమాచారం తెలుసునేందుకు ప్రయత్నించగా మల్లన్నసాగర్ అధికారులు అందుబాటులోకి రాలేదు.



నిర్మాణ పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

సంక్షిప్త వార్తలు

◆ **కుక్కల నివారణకు చర్యలు తీసుకోండి**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిశెట్టి రాజేంద్ర కుమార్‌కు బీఆర్ఎస్ యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆయన వెంట నాయకులు పర్శరాములు, చంద్రారెడ్డి, భిక్షపతి, సాయికిరణ్ తదితరులు ఉన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి చేయండి**

గజ్వేల్‌రూరల్: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గజ్వేల్ అంబేద్కర్ భవన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, కిష్టయ్య నూతనంగా నియామకమైన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కృష్ణ, ఎల్లయ్య, బాల్‌నర్సయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ **రోడ్డుకు మరమ్మతులు**

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల నుంచి ఘనపురం వెళ్లే రోడ్డుకు పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి శనివారం మరమ్మతులు చేయించారు. ఈసందర్భంగా ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **మత్స్యకారుల అభివృద్ధికి కృషి**

మర్కూక్(గజ్వేల్): మండలంలోని నర్సన్నపేటలో గల కూడవెల్లి వాగులో శనివారం సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లలను వదిలారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

◆ **సంప్రదాయ పంటలే మేలు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): సంప్రదాయ పంటలే ఆరోగ్యానికి మేలని పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య అన్నారు. శనివారం పీస్ కార్యాలయంలోని పాత పంటల పండగ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరిత విప్లవం పేరుతో పంటల ఉత్పత్తి పెరిగినప్పటికీ పర్యావరణం విధ్వంసానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాజశ్వేరి, నర్సింలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ **రైతులు ఉత్పత్తిదారులుగా ఎదగాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ఉత్పత్తిదారులుగా ఎదగాలని సర్పంచ్ లక్ష్మీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అలిరాజ్‌పేటలో ఏకలావ్య ఫౌండేషన్, చిన్న రైతుల వ్యాపార సహకార సంస్థ వార్షిక మహాసభను నిర్వహించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కరుణాకర్, వైస్ చైర్మన్‌గా వెంకటయ్యతో పాటు సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, సీఈఓ రాజేందర్‌రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

◆ **పథకాలను సద్వినియోగం చేసుకోండి**

మద్దూరు(హుస్నాబాద్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుందరగిరి స్రవంతి పర్శరాములు కోరారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉచితంగా ఆరోగ్యశ్రీ కార్డు ఈ–కేవైసీ సేవా కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలతతో కలిసి ప్రారంభించారు.

◆ **'ఐక్యంగా పోరాడుదాం'**

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట– భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నియోజకవర్గ మాదిగల రాజకీయ చైతన్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాదిగ చైతన్య వేదిక నాయకులు గుర్రాల శ్రీనివాస్, డప్పు శివరాజ్, చెక్కపల్లి పద్మయ్య మాట్లాడుతూ మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని.. హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

◆ **డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేత**

దౌల్తాబాద్(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని అప్పాయిపల్లి ఉపసర్పంచ్ ప్రభాకర్ గ్రామంలో 20 మంది యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను అందజేశారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని శుభోదయ విద్యానికేతన్‌లో మంత్రి హరీశ్‌రావు సహకారంతో ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, 7వ వార్డు కౌన్సిలర్ జుబేదా ఖతూన్ ప్రారంభించారు.

◆ **కూలీలకు ఉపాధి కల్పించాలి**

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టి కూలీలకు పని కల్పించాలని ఏపీడీ ఓబులేష్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బందితో పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. పనులు చేసిన కూలీలకు వేతనాలు వచ్చే విధంగా మస్టర్లను ఆఫీసులో అప్పగించి ఆన్‌లైన్ చేయించాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే పనులు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీఓ సత్యనారాయణ, ఏపీఓ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ నాయకుల రాస్తారోకో**

అక్కన్నపేట(హుస్నాబాద్): కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఇళ్లు, పార్టీ కార్యాలయంపై ఎంఐఎం నాయకుల దాడిని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు గొల్లపల్లి వీరాచారి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ పట్టణాధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ **జక్కాపూర్ విద్యార్థుల ప్రతిభ**

సిద్దిపేటరూరల్: రంగినేని ట్రస్ట్ సిరిసిల్ల వారు ప్రచురించిన 'కథల చెట్టు' పుస్తకంలో కథకు తగిన బొమ్మలు వేసినందుకు నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన బొప్ప సాత్విక, కయ్యాల అక్షయకు నగదు బహుమతులను శనివారం అందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు దుర్గయ్యను ఉపాధ్యాయులు అభినందించారు.